లెబనాన్‌లో పేజర్ల పేలుళ్లు

9 మంది హెజ్బొల్లా ఉగ్రవాదుల మృతి

- 3,000 మందికిపైగా తీవ్రగాయాలు
- సిరియాలోనూ కొన్ని చోట్ల పేలుళ్లు
- ఇజ్రాయెల్ పనేనని అనుమానాలు
- ప్రతీకారం తప్పదని హెజ్బొల్లా హెచ్చరిక

న్యూఢిల్లీ: లెబనాన్, సిరియాల్లో కమ్యూనికేషన్ కోసం ఉపయోగించే పేజర్లు వందలాదిగా పేలిపోవడం కలకలం రేపింది. మంగళవారం దాదాపు ఒకే సమయంలో అనేక చోట్ల జరిగిన ఈ సంఘటనల్లో హెజ్బొల్లా ఉగ్రవాదులు, మెడిక్స్ 9 మంది మరణించారు. దాదాపు 3,000 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో లెబనాన్ పార్లమెంటులో హెజ్బొల్లా సభ్యుని కుమారుడు, మరో ఉగ్రవాది కుమార్తె (10) కూడా ఉన్నారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇంత పెద్ద ఎత్తున జరిగిన భద్రతా ఉల్లంఘన ఇదేనని హెజ్బొల్లా వర్గాలు చెప్తున్నాయి. ఈ పేలుళ్లకు కారణాలను గుర్తించేందుకు విస్తృత స్థాయిలో భద్రత, శాస్త్రీయ దర్యాప్తు జరుగుతున్నట్లు హెజ్బొల్లా ఒక ప్రకటనలో తెలిపింది. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని ఉపయోగించి, వ్యక్తులు కమ్యూనికేషన్ కోసం ఉపయోగించే పేజర్లను పేల్చేశారని పేర్కొన్నది. ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపిన వివరాల ప్రకారం, లెబనాన్‌లోని ఇరాన్ రాయబారి మొజ్తబ అమని ఉపయోగించే పేజర్ కూడా పేలడంతో ఆయన స్వల్పంగా గాయపడినట్లు తెలుస్తున్నది.

సిరియాలోనూ..

లెబనాన్ రాజధాని బీరుట్ శివారు ప్రాంతాల్లో పేజర్ల పేలుళ్లలో వందలాది మంది గాయపడ్డారు. వీరిని వేర్వేరు దవాఖానల్లో చేర్పించారు. దక్షిణ లెబనాన్‌లో కూడా పేజర్లు పేలాయని, అనేక మంది గాయపడ్డారని వార్తా సంస్థలు చెప్తున్నాయి. సరిహద్దుల్లో ఉద్రిక్తతలు పెరుగుతున్న సమయంలో ఇజ్రాయెల్ రిమోట్ దాడికి పాల్పడిందని లెబనాన్ అధికారులు ఆరోపించారు. సిరియాలో కూడా కొన్ని చోట్ల పేజర్లు పేలి, కొందరు గాయపడినట్లు మీడియా కథనాలను బట్టి తెలుస్తున్నది.

గంటపాటు కొనసాగిన పేలుళ్లు

లెబనాన్ స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.45 గంటలకు ప్రారంభమైన ఈ పేజర్ల పేలుళ్లు వరుసగా ఓ గంట సేపు కొనసాగాయి. దేశవ్యాప్తంగా అనేక చోట్ల ఈ సంఘటనలు జరిగాయి. 50కిపైగా అంబులెన్స్‌లను, 300 మంది ఎమర్జెన్సీ మెడికల్ స్టాఫ్‌ను రంగంలోకి దించినట్లు లెబనీస్ రెడ్ క్రాస్ తెలిపింది. ఇటీవలి షిప్‌మెంట్‌లో వచ్చిన కొత్త పేజర్లను విసిరికొట్టాలని హెజ్బొల్లా తన సభ్యులను మంగళవారం ఆదేశించింది. మునుపెన్నడూ లేనివిధంగా శత్రువు అనేక ప్రాంతాల్లో భద్రత ఉల్లంఘనకు పాల్పడినట్లు తెలిపింది.

స్పందించని ఇజ్రాయెల్

ఈ దాడులకు కారణం ఇజ్రాయెల్ అని హెజ్బొల్లా ఆరోపిస్తున్నప్పటికీ, ఇజ్రాయెల్ సైన్యం తక్షణం స్పందించలేదు. అయితే, గత ఏడాది అక్టోబరు 7 దాడుల అనంతరం ప్రారంభమైన యుద్ధ లక్ష్యాలను విస్తృతం చేస్తున్నట్లు ఇజ్రాయెల్ ప్రకటించిన కొద్ది గంటల తర్వాత ఈ దాడులు జరగడం గమనార్హం. ఈ నేరపూరిత దాడులకు పూర్తి బాధ్యత ఇజ్రాయెల్‌దేనని హెజ్బొల్లా ఓ ప్రకటనలో ఆరోపించింది. ఈ దాడికి తగిన మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని, తగిన శిక్షను అనుభవించవలసి ఉంటుందని హెచ్చరించింది.

లిథియం బ్యాటరీలే కారణం

కొత్తగా వచ్చిన పేజర్లలోని లిథియం బ్యాటరీలే పేలి ఉంటాయని ఓ వార్తా సంస్థ తెలిపింది. వీటిని కొద్ది నెలల క్రితం హెజ్బొల్లా స్మగ్లింగ్ చేసి, తీసుకొచ్చినట్లు పేర్కొంది. లిథియం బ్యాటరీలు అతిగా వేడెక్కితే, పొగలు వస్తాయి, కరిగిపోతాయి. ఆ తర్వాత మండిపోయే అవకాశం కూడా ఉంటుంది. రీఛార్జబుల్ లిథియం బ్యాటరీలను సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రిక్ కార్లు వంటి కన్జ్యూమర్ ప్రొడక్ట్స్‌లో ఉపయోగిస్తారు. లిథియం బ్యాటరీ మండితే 590 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు మండుతుంది. కాగా, పేజర్లనే ఈ విధంగా పేల్చగలిగినప్పుడు స్మార్ట్‌ఫోన్లను పేల్చితే పరిస్థితి చాలా తీవ్రంగా ఉంటుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



పేజర్ పేలడం వల్ల బీరుట్‌లో నడి రోడ్డుపై గాయపడ్డ ఇద్దరు వ్యక్తులు

బాల నేరస్థుల పట్ల మితిమీరిన దయ

నిర్భయ కేసు నుంచి గుణపాఠం నేర్చుకోవడం లేదు: మధ్య ప్రదేశ్ హైకోర్టు

ఇండోర్: మన దేశంలో బాల నేరస్థుల పట్ల అతి దయతో వ్యవహరిస్తున్నట్లు మధ్య ప్రదేశ్ హైకోర్టు ఇండోర్ ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2012నాటి నిర్భయ గ్యాంగ్ రేప్ కేసు నుంచి చట్ట సభలు గుణపాఠం నేర్చుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. 2017లో అప్పటికి 17 ఏళ్ల వయసుగల బాలుడు నాలుగేళ్ల బాలికపై అత్యాచారం చేసినట్లు కేసు నమోదైంది. ఇండోర్‌లోని అదనపు సెషన్స్ జడ్జి అతనిని దోషిగా నిర్ధారించి, 2019 మే 8న పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. ఈ తీర్పు వెలువడిన ఆరు నెలల తర్వాత ఆ బాల నేరస్థుడు మరో ఏడుగురు బాలలతో కలిసి జువెనైల్ కరెక్షన్ హోమ్ నుంచి పారిపోయాడు. క్రింది కోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఈ బాల నేరస్థుని తరఫున మధ్య ప్రదేశ్ హైకోర్టులో అపీలు దాఖలైంది. విచారణ జరిపిన హైకోర్టు అపీలును డిస్మిస్ చేసింది. పరారైన అపీలుదారుపై వారంట్ జారీ చేయాలని ఈ నెల 11న ఆదేశించింది. మిగిలిన శిక్ష అమలుకు అతడిని అరెస్ట్ చేయాలని ఆదేశించింది.

ఎంబీబీఎస్ సీట్ల కోసం మతం మార్పు

మీరట్: ఎంబీబీఎస్ సీట్లు పొందేందుకు పలువురు అభ్యర్థులు అడ్డదారులు తొక్కారు. ఎలాగైనా సీట్లు సంపాదించాలన్న లక్ష్యంతో ఏకంగా మతాన్నే అడ్డగోలుగా మార్చుకున్నారు. యూపీలో మైనారిటీ కాలేజీల్లో సీట్లు పొందేందుకు 12 మందికిపైగా అభ్యర్థులు మతం మారినట్టు అధికారుల దర్యాప్తులో తేలింది. వీరందరూ మతమార్పిడి చట్టం 2021ని ఉల్లంఘించినట్టు అధికారులు గుర్తించారు. ఇలా వెలుగులోకి వచ్చిన 20 అడ్మిషన్లను అధికారులు స్క్రూటినీ చేస్తున్నారు. అభ్యర్థులు సమర్పించిన సర్టిఫికెట్లపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశించింది. అలాగే, ఉత్తరప్రదేశ్ హోం మంత్రిత్వశాఖకు ఈ విషయాన్ని తెలియజేసింది. మొత్తం 20 మంది అభ్యర్థుల్లో ఏడుగురి అడ్మిషన్లను రద్దు చేయగా, మరో ఏడుగురు స్వచ్ఛందంగా దరఖాస్తులను వెనక్కి తీసుకున్నారు.

న్యూయార్క్‌లో హిందూ ఆలయంపై దాడి

న్యూయార్క్: అమెరికాలోని మెల్విల్లేలో ఉన్న బీఏపీఎస్ స్వామి నారాయణ్ దేవాలయంపై దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది ఆమోదనీయం కాదని, అత్యంత హేయమైన చర్య అని న్యూయార్క్‌లోని ఇండియన్ కాన్సులేట్ స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తున్న వీడియోలను బట్టి ఈ దేవాలయానికి వెళ్లే మార్గంలోఅర్థరహితమైన రాతలు రాసినట్లు తెలుస్తున్నది. ప్రధాని మోదీ ఈ నెల 22న ప్రసంగించబోతున్న వేదికకు 28 కి.మీ దూరంలో ఈ దేవాలయం ఉంది.

ఢిల్లీ నూతన సీఎంగా ఆతిశీ

- ఆప్ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవం
- 26 లేదా 27న ప్రమాణ స్వీకారం
- పదవికి రాజీనామా చేసిన కేజ్రీవాల్
- ఢిల్లీకి యంగెస్ట్ సీఎంగా ఆతిశీ రికార్డు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేశారు. తన మంత్రివర్గ సహచరులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలుసుకున్న కేజ్రీవాల్ తన రాజీనామా పత్రాన్ని అందించారు. కేజ్రీవాల్ స్థానంలో ఢిల్లీ తదుపరి ముఖ్యమంత్రిగా ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు ఆతిశీని పార్టీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. ఈ నెల 26 లేదా 27న ఆమె సీఎంగా ప్రమాణం చేయనున్నట్టు సమాచారం. ఢిల్లీ మద్యం విధానం కేసులో అరెస్టయిన కేజ్రీవాల్ ఇటీవల బెయిల్‌పై విడుదలైన సందర్భంగా సీఎం పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఢిల్లీ ప్రజలు తాను నిజాయితీపరుడినని సర్టిఫికెట్ ఇచ్చేవరకూ సీఎం పదవిని చేపట్టబోనని ఆయన ప్రతినబూనారు. ఎల్జీని కలుసుకున్న అనంతరం ఆతిశీ మీడియాతో మాట్లాడుతూ.. మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఎల్జీకి తెలిపామని, ఢిల్లీ ప్రజల ప్రయోజనాలను తాను పరిరక్షిస్తానని పేర్కొన్నారు. మంత్రి గోపాల్ రాయ్ మాట్లాడుతూ.. ఆతిశీ నేతృత్వంలో కొత్త మంత్రివర్గం ప్రమాణం చేసేందుకు తేదీ ఖరారు చేయాల్సిందిగా ఎల్జీని కోరామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకొని తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నాయని ఆతిశీ ఆరోపించారు. కేజ్రీవాల్ కాకుండా మరొక నాయకుడైతే సీఎం కుర్చీని వదిలిపెట్టేవారు కాదని అన్నారు. కేజ్రీవాల్ ప్రజాకోర్టుకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని, అందుకే రాజీనామా చేశారని చెప్పారు. ఇది తమకు ఎంతో బాధాకరమైన సమయం అని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరుగనున్న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్‌ను తమ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని రాష్ట్ర ప్రజలు ప్రతినబూనారని చెప్పారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. అయితే మహారాష్ట్రతోపాటే నవంబర్‌లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు కూడా నిర్వహించాలని కేజ్రీవాల్ కోరుతున్నారు.

మూడో మహిళా సీఎం

'ఢిల్లీ సీఎంగా అతిపెద్ద బాధ్యతను తనపై మోపిన 'గురువు' కేజ్రీవాల్‌కు ధన్యవాదాలు' అని ఆప్ నాయకురాలు ఆతిశీ పేర్కొన్నారు. కేజ్రీవాల్ మార్గదర్శకత్వంలో పనిచేస్తానని చెప్పారు. కాంగ్రెస్‌కు చెందిన షీలాదీక్షిత్, బీజేపీకి చెందిన సుష్మా స్వరాజ్ తరువాత ఢిల్లీకి మూడో మహిళా సీఎంగా ఆతిశీ బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం దేశంలో మమతా బెనర్జీ ఒక్కరే మహిళా సీఎం కాగా, రెండో సీఎంగా ఆతిశీ నిలవనున్నారు. ఢిల్లీ సీఎంగా బాధ్యతలు చేపట్టనున్న అతి పిన్న వయస్కురాలు (43)గా కూడా ఆతిశీ నిలవనున్నారు. ఆప్ శాసనసభాపక్ష సమావేశంలో ఆతిశీ పేరును కేజ్రీవాల్ ప్రతిపాదించగా పార్టీ ఎమ్మెల్యేలందరూ మద్దతు తెలిపారు. ఆప్ శాసనసభాపక్ష నేతగా ఎన్నికవడంపై ఆతిశీ స్పందిస్తూ.. ఇది ఒకవైపు తనకు ఆనందాన్ని, మరోవైపు తీవ్ర ఆవేదనను కలిగించే సందర్భమని వ్యాఖ్యానించారు. మొదటిసారి రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి నేరుగా సీఎం పదవిని పొందడం కేవలం ఆమ్ ఆద్మీ పార్టీలోనే సాధ్యమని అన్నారు. తనపై నమ్మకముంచిన కేజ్రీవాల్ తనను తొలుత ఎమ్మెల్యేను చేశారని, ఆపై మంత్రి పదవినిచ్చారని, ఇప్పుడు ముఖ్యమంత్రిని చేస్తున్నారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మిగిలిన కొద్ది నెలలు.. తాను మళ్లీ ఢిల్లీ సీఎం కుర్చీపై కేజ్రీవాల్‌ను కూర్చోబెట్టేందుకు కృషి చేస్తానని చెప్పారు.

అత్యధిక శాఖలు ఆమె చేతిలోనే

సలహాదారు పదవి నుంచి మంత్రి స్థాయికి ఎదిగిన ఆతిశీ అతి చిన్న వయసులోనే అత్యధిక శాఖలు నిర్వహించిన మహిళగా ఖ్యాతి పొందారు. ఆప్ వ్యవస్థాపక సభ్యులలో ఒకరిగా పార్టీ విధానాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. 2013లో ఆప్‌లో చేరిన ఆతిశీ అదే ఏడాది పార్టీ ప్రణాళిక ముసాయిదా కమిటీలో సభ్యురాలిగా ఉన్నారు. 2020లో కల్కాజీ నుంచి గెలుపొందారు. గత ఏడాది ఫిబ్రవరిలో డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా అరెస్టయిన సంక్షోభ పరిస్థితుల్లో ఆమె మంత్రి పదవిని చేపట్టారు. అత్యంత కీలకమైన మంత్రిత్వ శాఖలను చేపట్టిన ఆతిశీ.. సీఎం జైలుకెళ్లినప్పుడు అటు ప్రభుత్వాన్ని, ఇటు పార్టీని ఏకతాటిపై నిలిపారు.

కదులుతున్న కారులో బాలికపై గ్యాంగ్‌రేప్

సహర్సా, సెప్టెంబర్ 17: బీహార్‌లోని సహర్సా జిల్లాలో కదులుతున్న కారులో ముగ్గురు వ్యక్తులు ఒక టీనేజీ బాలికపై సామూహిక లైంగిక దాడి చేశారని, ఈ ఘటనలో ఒక నిందితుడిని అరెస్ట్ చేసామని పోలీసులు మంగళవారం తెలిపారు. 'ఈ నెల 14న ముగ్గురు తుపాకీతో చంపేస్తామని బెదిరించి కదులుతున్న కారులో తనపై లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు మాకు ఫిర్యాదు చేసింది' అని ఎస్పీ హిమాన్షు తెలిపారు. ఆమెను వైద్య పరీక్షలకు పంపామని, నివేదిక కోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు. దర్యాప్తుకు ప్రత్యేక బృం దాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. లైంగిక దాడి జరిగిందని చెప్తున్న కారును సీజ్ చేశామని తెలిపారు.

మలప్పురంలో మంకీపాక్స్!

తిరువనంతపురం, సెప్టెంబర్ 17: నిఫా వైరస్‌తో పరిస్థితి ఆందోళనకరగా ఉన్న కేరళలోని మలప్పురంలో మంకీపాక్స్ కూడా వెలుగులోకి వచ్చింది. తాజాగా అనుమానిత కేసు ఒకటి నమోదైంది. నిఫా వైరస్ బారిన పడి 24 ఏండ్ల వ్యక్తి ఒకరు ఈనెల 9న చనిపోగా, దీనికి తోడు మంకీపాక్స్ కూడా జిల్లాలో వెలుగు చూడటం తీవ్ర కలకలం రేపుతున్నది. కొద్ది రోజుల క్రితం విదేశాలకు వెళ్లి వచ్చి అనారోగ్యంతో ఇక్కడి ఓ ప్రైవేట్ దవాఖానలో చేరగా, రోగ లక్షణాలను బట్టి అతడికి మంకీపాక్స్ సోకినట్టు అనుమానిస్తున్నామని జిల్లా వైద్య అధికారి ఒకరు చెప్పారు. అతడి నుంచి సేకరించిన నమూనాలను కోజికోడ్ మెడికల్ కాలేజీకి పంపామని, ఫలితం కోసం ఎదురుచూస్తున్నట్టు చెప్పారు. అయితే మనదేశంలో 2022 జూలై నుంచి ఇప్పటివరకు 30 ఎంపాక్స్ కేసులు నమోదయ్యాయి.

యూరప్‌లో వేగంగా వ్యాపిస్తున్న

'ఎక్స్‌ఈసీ' వేరియంట్

బెర్లిన్, సెప్టెంబర్ 17: యూరప్‌లో కొత్త రకం కొవిడ్ వేరియంట్ 'ఎక్స్‌ఈసీ' వేగంగా విస్తరిస్తున్నది. రెండు ఒమిక్రాన్ సబ్ వేరియెంట్స్ నుంచి పుట్టుకొచ్చిన హైబ్రిడ్ రకంగా 'ఎక్స్‌ఈసీ'ని వైద్య నిపుణులు పేర్కొన్నారు. ఒమిక్రాన్ రోగుల్లో కనపడిన జ్వరం, ఒళ్లు నొప్పులు, గొంతు నొప్పి, వంటి లక్షణాలే ఇందులోనూ కనపడుతున్నాయని తెలిసింది. 'ఎక్స్‌ఈసీ' తొలి కేసు జర్మనీలో ఈ ఏడాది జూన్‌లో బయటపడగా, ఇప్పటివరకు 13 దేశాలకు వైరస్ వ్యాప్తి చెందింది. దీనిని ఎదుర్కొనేందుకు వ్యాక్సిన్ లేదా బూస్టర్ డోస్ తీసుకోవటం చాలా అవసరమని వైద్య నిపుణులు అంటున్నారు.. డెన్మార్క్, జర్మనీల్లో 'ఎక్స్‌ఈసీ' వేగంగా విస్తరిస్తున్నదని డాటా విశ్లేషకుడు మైక్ హనీ చెప్పారు.

25 ఏండ్లలో 4 కోట్ల మందిని బలి తీసుకోనున్న సూపర్‌బగ్స్

తాజా అధ్యయనం హెచ్చరిక

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: ఔషధాలకు లొంగని సూపర్‌బగ్స్ లేదా యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) వల్ల రానున్న 25 ఏండ్లలో దాదాపు 4 కోట్ల మంది ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉన్నదని ఓ అధ్యయనం హెచ్చరించింది. ఈ పరిస్థితిని అడ్డుకునేందుకు చర్యలు చేపట్టకపోతే మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని స్పష్టం చేసింది. సూపర్‌బగ్స్ వల్ల తలెత్తే పర్యవసానాలను అంచనా వేసేందుకు జరిపిన ఈ అధ్యయన వివరాలు సోమవారం 'లాన్సెట్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. వైద్య రంగంలో ప్రపంచం ఎంతో పురోగతి సాధించినప్పటికీ, గత 3 దశాబ్దాల్లో ఐదేండ్లలోపు వయసున్న పిల్లల మరణాలను 50 శాతానికిపైగా తగ్గించగలిగినప్పటికీ 1990-2021 మధ్య కాలంలో సూపర్‌బగ్స్ వల్ల ఏటా 10 లక్షల మందికిపైగా మరణించినట్టు పరిశోధకులు ఈ అధ్యయనంలో తేల్చారు. వైద్య రంగంలో సాధించిన విజయాలు ఇన్ఫెక్షన్ల నియంత్రణకు, నివారణకు తోడ్పడినప్పటికీ సూపర్‌బగ్స్ ఎప్పటికప్పుడు శక్తిసామర్థ్యాలను పెంచుకుంటూ మానవాళికి సవాళ్లు విసురుతూనే ఉన్నాయని తెలిపారు.

బుల్డోజర్ జస్టిస్‌కు బ్రేకులు

వచ్చే నెల 1 వరకు కూల్చివేతలు ఆపండి

అన్ని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ: కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు దుందుడుకుగా బుల్డోజర్లతో కూల్చివేతలకు పాల్పడుతుండటాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఆక్రమణల తొలగింపు పేరుతో సాగిస్తున్న ఈ బుల్డోజర్ జస్టిస్‌ను వచ్చే నెల 1 వరకు ఆపాలని అన్ని రాష్ట్రాలను మంగళవారం ఆదేశించింది. నిందితుల ఆస్తులతో సహా ఎటువంటి ఆస్తినీ తన అనుమతి లేకుండా కూల్చవద్దని స్పష్టం చేసింది. చట్టవిరుద్ధంగా కనీసం ఒక ఇంటిని కూల్చివేయడమైనా అది రాజ్యాంగ ఆత్మ, లక్షణాలకు వ్యతిరేకమని స్పష్టంచేసింది. అయితే, రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వే లైన్లు, చెరువులు వంటి బహిరంగ ప్రదేశాల్లోని అనధికారిక నిర్మాణాలకు ఈ ఆదేశాలు వర్తించబోవని తెలిపింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ ధర్మాసనం ఈ ఆదేశాలను ఇచ్చింది. చాలా రాష్ట్రాల్లో ఇళ్లు, ఇతర భవనాలను చట్టవిరుద్ధంగా కూల్చేస్తున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలను జారీ చేసింది. మరోవైపు వీటిని ఆపితే ఆక్రమణల తొలగింపు ఆలస్యమవుతుందన్న ప్రభుత్వ వాదనను కోర్టు కొట్టివేసింది. 'వచ్చే విచారణ వరకు మీ చర్యలను ఆపాలని మేం కోరినంత మాత్రాన మిన్ను విరిగి మీద పడదు' అని కోర్టు వ్యాఖ్యానించింది.

ఇదే అంశంపై ఈ నెల 2న జరిగిన విచారణలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలపై వచ్చిన స్పందనలను మంగళవారం ప్రస్తావించింది. దేశవ్యాప్తంగా అమలు చేయదగిన మార్గదర్శకాలను జారీ చేస్తామని ఈ నెల 2న చెప్పింది. దీనిపై స్పందిస్తూ వచ్చిన స్టేట్‌మెంట్లలో, బుల్డోజర్ కొనసాగుతుందని, స్టీరింగ్ ఎవరి చేతుల్లో ఉందనే దానిపై అది ఆధారపడుతుందని అన్నారని గుర్తు చేసింది. సొలిసిటర్ జనరల్ మెహతాను ఉద్దేశించి న్యాయమూర్తులు మాట్లాడుతూ, 'ఈ మార్గదర్శకాలను జారీ చేసిన తర్వాత, ఈ ప్రాక్టీస్‌ను ఘనత చాటుకోవడం, హీరోయిజంగా చూపే యత్నంపై మీ సహాయం కోరుతాం. దీనిని ఎలా ఆపాలో మీరు మాకు సహాయపడుదురుగాని. అవసరమైతే, ఎన్నికల కమిషన్‌ను కూడా అడుగుతాం'' అని చెప్పారు. ఆ సమయంలో పిటిషనర్ల తరఫున హాజరైన న్యాయవాది ఒకరు మాట్లాడుతూ, ఈ నెల 2న విచారణ సందర్భంగా ఆదేశాలను ఇచ్చినప్పటికీ, ఆ తర్వాత కూడా దేశంలో కూల్చివేతలు కొనసాగాయని చెప్పారు.

చట్టప్రకారమే కూల్చివేతలు: కేంద్రం

సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ, నిర్మాణాల కూల్చివేతలపై ఓ కథనాన్ని రూపొందిస్తున్నారని అన్నారు. ఓ మతానికి చెందిన వాడైనందువల్ల అతని ఇంటిని కూల్చేశారని ఆరోపిస్తున్న పిటిషన్ సుప్రీంకోర్టు ముందు ఉందన్నారు. చట్టాన్ని పాటించకుండా కూల్చివేసిన ఒక ఉదాహరణను కోర్ట్ దృష్టికి తీసుకురమ్మనండి అని అన్నారు. ప్రభావిత వ్యక్తులకు తమ నిర్మాణాలు చట్టవిరుద్ధమని, తమకు నోటీసులు వచ్చాయని తెలుసునని, అందుకే వారు కోర్టును ఆశ్రయించడం లేదని చెప్పారు. ఓ భావాన్ని రూపొందిస్తున్నారని మెహతా చేసిన వ్యాఖ్యలపై ధర్మాసనం స్పందిస్తూ, 'బయటి గలాభా మమ్మల్ని ప్రభావితం చేయజాలదని హామీ ఇస్తున్నాం' అని స్పష్టం చేసింది.

మహిళలు నైట్ డ్యూటీ చేయరని

మీరెలా చెబుతారు?

- వారికి ఎందుకు ఈ పరిమితులు?
- రక్షణ కల్పించడం మీ బాధ్యత
- బెంగాల్ సర్కారుపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: మహిళా వైద్యులకు నైట్ షిఫ్ట్ డ్యూటీలు వేయరాదంటూ ప్రభుత్వ ఆధ్వర్యంలోని దవాఖానలకు ఆదేశాలు ఇస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీం కోర్టు మంగళవారం తప్పు బట్టింది. వారికి రక్షణ కల్పించాల్సి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని స్పష్టం చేసింది. కోల్‌కతా ఆర్‌జీ కర్ దవాఖానలో పీజీ ట్రైనీ డాక్టర్ హత్యాచారం కేసును సుప్రీం కోర్టు విచారించింది. బెంగాల్ ప్రభుత్వం జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌ను వెంటనే సవరించాలని చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆదేశించారు. 'మహిళలు రాత్రి వేళ పనిచేయరని మీరెలా చెబుతారు? మహిళా వైద్యులకు ఎందుకు ఈ పరిమితులు? వారేమీ తమకు మినహాయింపు కావాలని కోరడం లేదు. రాత్రి షిఫ్ట్‌లలో కూడా పని చేయడానికి వారు సిద్ధం' అని న్యాయస్థానం పేర్కొంది. వారికి భద్రతా చర్యలు కల్పించడంలోనే ఈ సమస్యకు పరిష్కారం ఉంది. రాత్రి షిఫ్టుల్లో పనిచేయకుండా వారిని మీరు నిరోధించ లేరు. రాత్రి విధుల్లో ఉన్నప్పుడు వారికి భద్రత, రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని చంద్రచూడ్ స్పష్టం చేశారు. కాగా, సోమవారం బెంగాల్ సీఎంతో జరిపిన చర్చల మేరకు చర్యలు తీసుకుంటే విధులకు హాజరవ్వడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని జూనియర్ డాక్టర్లు కోర్టుకు స్పష్టం చేశారు.

పోలీస్ కమిషనర్ బదిలీ

గత నెల రోజులకు పైగా ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లకు సోమవారం సీఎం మమతా బెనర్జీ ఇచ్చిన ప్రధాన హామీ మేరకు ప్రభుత్వం మంగళవారం కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్‌ను బదిలీ చేసింది. ఆయన స్థానంలో మనోజ్ కుమార్ వర్మను నియమించారు. 1998 బ్యాచ్ అధికారి అయిన మనోజ్ కుమార్ ప్రస్తుతం అడిషనల్ డీజీపీ (లా అండ్ ఆర్డర్)గా పనిచేస్తున్నారు. అలాగే మనోజ్ స్థానంలో చాలానాళ్లుగా కోల్‌కతా పోలీస్ కమిషనర్ స్థానం కోసం వేచి చూస్తున్న జావెద్ షమీమ్‌ను నియమించారు.

సీబీఐ నివేదిక దిగ్భ్రాంతి కలిగించింది

సీబీఐ మధ్యంతర రిపోర్టులో పేర్కొన్న అంశాలు దిగ్భ్రాంతి గొలిపేవిగా ఉన్నాయని, అవి తమను కలవరపరిచాయని న్యాయస్థానం పేర్కొంది. అయితే అందులోని అంశాలను వెల్లడించడం సబబుగా ఉండదని, అది సీబీఐ దర్యాప్తుపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపింది. కీలక అంశాలపై ఇప్పుడే ఒక అభిప్రాయానికి రాలేమని పేర్కొంది.

కొత్త బ్లడ్ గ్రూప్ 'మాల్'

- 50 ఏండ్ల మిస్టరీని ఛేదించిన శాస్త్రవేత్తలు
- క్లిష్టమైన చికిత్సల నిర్వహణ ఇకపై సులభం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): ఇంగ్లండ్ శాస్త్రవేత్తల బృం దం కొత్త బ్లడ్ గ్రూప్‌ను కనిపెట్టింది. దీనిని 'మాల్'గా వ్యవహరిస్తున్నది. 1972లో గుర్తించిన ఏఎన్‌డబ్ల్యూ యాంటిజెన్ ప్రొటీన్‌కు కారణం ఈ బ్లడ్ గ్రూపేనని ఇంగ్లండ్‌లోని ఎన్‌హెచ్ఎస్, యూనివర్సిటీ ఆఫ్ బ్రిస్టల్ శాస్త్రవేత్తలు తెలిపారు. తాజా పరిశోధనతో 50 ఏండ్ల మిస్టరీని ఛేదించామన్న పరిశోధకులు.. క్లిష్టమైన చికిత్సలు, రక్త మార్పిడిలో ఏర్పడే సమస్యలకు ఈ కొత్త బ్లడ్ గ్రూప్ సులభంగా పరిష్కారం చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏమిటీ ఏఎన్‌డబ్ల్యూ యాంటిజెన్?

ఏ, బీ, ఏబీ, వో, ఆర్‌హెచ్.. ఇలా ప్రపంచంలో ఇప్పటివరకూ 47 రకాల బ్లడ్ గ్రూప్‌లను శాస్త్రవేత్తలు గుర్తించారు. ప్రతీ బ్లడ్ గ్రూప్‌లో ఏదో ఒక యాంటిజెన్ ఉంటుంది. ఈ ప్రొటీన్‌ను బట్టే వ్యక్తి రక్తం ఏ రకానిదన్న విషయం తెలుస్తుంది. అయితే, 1972లో తొలిసారిగా ఏఎన్‌డబ్ల్యూ యాంటిజెన్ అనే కొత్త ప్రొటీన్‌ను శాస్త్రవేత్తలు గుర్తించారు. అయితే, అప్పటికే ఉన్న బ్లడ్ గ్రూప్‌లలో ఏ గ్రూప్‌నకూ ఈ ప్రొటీన్ సరిపోలలేదు. దీంతో ఈ యాంటిజెన్ ఉన్న వేలాది మందికి అత్యవసరమైన చికిత్స చేయడం సాధ్యపడలేదు. రక్తమార్పిడి చేసే సమయంలో సమస్యలు ఎదురయ్యేవి. అయితే, తాజా పరిశోధనలో ఏఎన్ డబ్ల్యూ యాంటిజెన్ ప్రొటీన్ 'మాల్' అనే కొత్త బ్లడ్ గ్రూప్‌నకు చెందినదని శాస్త్రవేత్తలు గుర్తించారు.

పసిఫిక్‌పై 'ఐరన్' పందిరి!

- *భూతాపాన్ని తగ్గించడానికే..*
- *3,800 చదరపు మైళ్ల పరిధిలో ఐరన్ సల్ఫేట్ పౌడర్‌తో ప్రయోగం*

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): పెరుగుతున్న భూతాపాన్ని కట్టడి చేయడానికి శాస్త్రవేత్తలు ఓ బృహత్తర ప్రయోగానికి సమాయత్తమయ్యారు. పసిఫిక్ మహా సముద్రం ఉపరితలంపై ఐరన్ సల్ఫేట్‌ను పరిచి వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గించేందుకు ఓషన్ ఐరన్ ఫర్టిలైజేషన్ (ఓఐఎఫ్) అనే ప్రయోగానికి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా పసిఫిక్ మహా సముద్రానికి ఆగ్నేయ ప్రాంతంలో 3,800 చదరపు మైళ్ల పరిధిలో ఐరన్ సల్ఫేట్ పౌడర్‌ను పడవల ద్వారా వెదజల్లనున్నారు. ఐరన్ సల్ఫేట్‌కు సీవో2ను పీల్చుకొనే స్వభావం ఉండటంతో తమ ప్రయోగం ద్వారా భూతాపాన్ని 2.7 డిగ్రీల ఫారన్‌హీట్ మేర తగ్గించవచ్చని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 2026నాటికి ఈ ప్రయోగం తొలిదశ పూర్తి చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నారు.

సముద్రంపైనే ఎందుకు?

40 బిలియన్ టన్నుల కార్బన్ డయాక్సైడ్ ఏటా వాతావరణంలోకి విడుదల అవుతున్నది. దీంట్లో 30 శాతాన్ని సముద్రాలే పీల్చుకొంటున్నాయి. దీంతో భూతాపాన్ని తగ్గించడానికి సముద్ర జలాల్లోని సీవో2 స్థాయిలను తగ్గించాలని శాస్త్రవేత్తలు నిర్ణయించారు. సముద్రం నీటిలో సీవో2ను వేగంగా పీల్చుకొనే ఫైటోప్లాంక్టన్ అనే ఒకరకమైన నాచును ఐరన్ సల్ఫేట్ సాయంతో పెంచడానికి సిద్ధమయ్యారు.

ఆందోళనలు కూడా..

తాజా ప్రయోగంతో సముద్ర జీవాలపై ప్రతికూల ప్రభావం పడొచ్చని ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సముద్ర జలాల్లో ఐరన్ సల్ఫేట్ మోతాదు పెరగడంతో సముద్ర జీవుల ఆహారగొలుసుపై ప్రభావం పడొచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

భూతాపాన్ని తగ్గించే ఓఐఎఫ్ ప్రయోగం సాగేది ఇలా..

బీహార్ గ్రాడ్యుయేట్‌కి రూ.2 కోట్ల ప్యాకేజీ

పాట్నా: బీహార్ యువకుడు అభిషేక్ కుమార్‌కు గూగుల్ లండన్ కార్యాలయంలో రూ.2 కోట్ల వార్షిక ప్యాకేజీ లభించింది. ఆయన వచ్చే నెలలో ఉద్యోగ బాధ్యతలను స్వీకరిస్తారు. ఆయన పాట్నాలోని ఎన్ఐటీలో బీటెక్ చేశారు. 'ఇది నా అతి గొప్ప విజయం. చాలా మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు గూగుల్‌లో పని చేయడం ఓ స్వప్నం. ఇంపాక్ట్‌ఫుల్ ప్రాజెక్టులపై పని చేసే అవకాశం దక్కడం చాలా సంతోషంగా ఉంది' అని అభిషేక్ చెప్పారు. అభిషేక్ 2022లో అమెజాన్‌లో రూ.1.08 కోట్ల ప్యాకేజీ పొందారు. అక్కడ ఆయన 2023 మార్చి వరకు పని చేశారు. ఆ తర్వాత జర్మన్‌కు చెందిన ఫారిన్ ఎక్స్ఛేంజ్ ట్రేడింగ్ యూనిట్‌లో జాయిన్ అయ్యారు.